మట్టి ప్రతిమలే శ్రేయస్కరం

- పర్యావరణ హిత గణపతిని పూజిద్దాం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



బీవీకే స్కూల్‌లో మట్టి గణపతులను అందజేస్తున్న కరణంరెడ్డి తదితరులు



మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



విగ్రహాలు పంపిణీ చేస్తున్న విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

గాజువాక: వినాయక చవితి మహోత్సవాల్లో మట్టితో తయారు చేసిన ప్రతిమలను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో శనివారం మట్టి వినాయక ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక విగ్రహాలు అందంగా ఉండటం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి రసాయనాలతో కూడిన మెటీరియల్‌ను ఉపయోగిస్తుంటారని, దీనివల్ల పర్యావరణానికి తీవ్ర కీడు జరుగుతుందని చెప్పారు. పర్యావరణ హితంగా ప్రజలంతా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఇప్పటికే పర్యావరణ పరిరక్షణపై అందరిలోనూ చైతన్యం వచ్చిందని, దానికి కొనసాగింపుగా మట్టి ప్రతిమలను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, సివిల్ సప్‌లెస్ట్ డైరెక్టర్ బోగాది సన్ని, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాల శ్రీనివాసరావు, దొడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

- జీవీఎంసీ 66వ వార్డు బీవీకే స్కూల్‌లో మట్టి గణపతి విగ్రహాలను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ శేషుప్రసాద్ తదితరులు పంపిణీ చేశారు.
- చట్టివానిపాలెంలోని భాస్కర్ విద్యానికేతన్ విద్యార్థులు మట్టితో గణపతి ప్రతిమలను తయారు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ పాలవలస భాస్కరరావు వారిని అభినందించారు.
- సుందరయ్య కాలనీలోని రవీంద్ర ఇండియన్ స్కూల్‌లో కాలుష్యరహితంగా వినాయక చవితి నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి ప్రతిమల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రిన్సిపాల్ ఎస్‌వీకే పరశురామ్ విద్యార్థులకు వివరించారు.
- శ్రీనగర్‌లోని యాపిల్ ఐ స్కూల్ విద్యార్థులు మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను కళాత్మకంగా ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ ప్రమీలా ముఖర్జీ విద్యార్థులను అభినందించారు.

అగనంపూడి: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. కళాశాల, గ్రీన్‌క్లబ్‌లు, ఎన్ఎస్ఎస్ సారథ్యంలో విద్యార్థులకు, పరిసర కాలనీ వాసులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాల వల్ల కాలుష్య సమస్య తలెత్తదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గుణ మంజూష, అరుణకుమారి, సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో డ్వాక్రా రిసోర్స్‌పర్సన్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. శనివారం ఆర్‌పీ గొంతిన సత్యవతి, గొంతిన శ్రీనివాసరావుల ఆర్థిక సహకారంతో సమకూర్చిన సుమారు 300 మట్టి విగ్రహాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంద్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, వసుంధర, పలువురు డ్వాక్రా సంఘాల ఆర్‌పీలు పాల్గొన్నారు.



భాస్కర్ విద్యానికేతన్‌లో విద్యార్థులు తయారు చేసిన మట్టి ప్రతిమలు



68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సిగడం చైతన్య జ్ఞాపకార్థం..

68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో స్వర్గీయ సిగడం చైతన్య జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు సిగడం సత్యనారాయణ, లక్ష్మి దంపతులు సుమారు 200 మట్టి విగ్రహాలను భక్తులకు అందజేశారు.

క్లుప్తంగా

బోగాదికి ఎమ్మెల్యే నాగిరెడ్డి అభినందన



బోగాది సన్యాసిరావును శాలువా కప్పి అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: విశాఖ జిల్లా ఫుడ్ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా నియమితులైన 69వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు (సన్ని)ను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శాలువా కప్పి అభినందించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జిలు ధర్మాల శ్రీను, దొడ్డి రమణ, నాయకులు కాకి అప్పలరెడ్డి, అంగ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

20న ఉమ్మడి విశాఖ జిల్లా వాలీబాల్ పోటీలు

అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లా (విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు) వాలీబాల్ పోటీలు ఈనెల 20వ తేదీన 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బాల, బాలికల (అండర్–17) వాలీబాల్ పోటీలు, ఎంపికలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు క్రీడాకారులు చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు. పోటీల అనంతరం రాష్ట్ర జట్టుకు ఎంపిక జరుగుతుందన్నారు.

ఘనంగా అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న రమణ, మంజుల తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు దొడ్డి రమణ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మంజుల, పిట్టా ప్రకాష్‌రెడ్డి, యాడ్ల అప్పలనాయుడు, రత్నం, రామారావు, సజన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పీలో హోమం



హోమంలో పాల్గొన్న అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ)లో శనివారం హోమం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి ఎటువంటి ఆటంకాలు ఎదురవ్వకుండా, ఉక్కు ఉద్యోగులకు అన్ని విధాలుగా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ రుత్వికులు హోమం చేశారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆర్ఎంహెచ్‌పీ విభాగాధిపతి పి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఎస్.వి. స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో విభాగం అధికారులు కన్నయ్, చక్రవర్తి, అలధర్, శ్రీనివాస్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఎన్నేటి రమణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఓజోన్ పొర దెబ్బతింటే మనుగడకే ముప్పు



ఓజోన్ ఆకారంలో విద్యార్థులు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అగనంపూడి: ఓజోన్ పొరను కాపాడుకోకపోతే మానవాళి మనుగడకు ప్రమాదం తప్పదని లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు అన్నారు. జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా లంకెలపాలెం హైస్కూల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనిషి చేష్టల వల్ల ప్రకృతి వికృతంగా మారుతుందన్నారు. దీని వల్ల అతినీలలోహిత కిరణాలు భూమిపై నేరుగా పడి ప్రమాదకర పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. దీని నివారణకు మొక్కలు నాటటడం, కాలుష్యాన్ని నివారించడం, ప్లాస్టిక్ నిషేధం వంటివి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ లక్ష్మీరాణి, ఎన్‌జీసీ గ్రీన్ టీచర్ విజయలక్ష్మి, కె.రమణ, పండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నడుపూరు జెడ్పీ హైస్కూల్లో..

పెదగంట్యాడ: ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని శనివారం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓజోన్ పొర దెబ్బతింటే మానవాళి మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. ఉపాధ్యాయులు పి. నారాయణరావు, సురేష్, ఉమా కృష్ణకుమారి, ఉషారాణి, రత్నాయమ్మ, ఏంజిలీన, శేషుకుమారి, శ్రీదేవి పాల్గొన్నారు.



గాజువాక జెడ్పీ హైస్కూల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఓజోన్‌ను కాపాడుకుందాం

గాజువాక: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం, ఓజోన్ పొరను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం కె.విజయ ప్రశాంతి అన్నారు. హైస్కూల్‌లో శనివారం ఓజోన్ డేను ఘనంగా నిర్వహించారు. ఓజోన్ పొరను కాపాడుకుందామంటూ ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ క్లస్టర్ కో ఆర్డినేటర్ సిహెచ్.కమలరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఓటర్ల జాబితా ముసాయిదాల తయారీ గడువు ఈనెల 15న ముగిసిన నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై దృష్టి సారించాలని గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియలో ఏ ఒక్కరూ అలక్ష్యం ప్రదర్శించవద్దన్నారు. ఈ అంశంపై ఎలక్షన్ కమిషన్ సీరియస్‌గా ఉంటుందని, ప్రతి పని పారదర్శకంగా జరగాలని అన్నారు. తాను ఇప్పటికే నియోజకవర్గంలో గల 305 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి రేషనలైజేషన్‌పై నివేదిక తయారు చేసినట్టు తెలిపారు. నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, తక్కువ ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాల తొలగింపు, అక్కడి ఓట్లను పక్కనే ఉన్న మరో పోలింగ్ కేంద్రానికి బదిలీ చేయడం వంటి అంశాలపై నివేదిక తయారు చేసినట్టు తెలిపారు. సమావేశంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, తహసీల్దార్లు రమాదేవి, పాల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన జీవీఎంసీ కాంట్రాక్టర్లు



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్ : కొత్తగా ఎన్నికైన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం శనివారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాదపూర్వకంగా కలిసింది. అధ్యక్షుడు గొంప చంద్రమౌళి ఎన్నికైన కార్యవర్గ సభ్యులను మేయర్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ జనవరి నుంచి ఏప్రిల్ 2023 వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణం చెల్లించాలని, సాంకేతిక సమస్యలను నివారించాలని కోరారు. అధికారులు, కాంట్రాక్టర్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అందుకు మేయర్ స్పందిస్తూ త్వరలోనే అధికారులు, కాంట్రాక్టర్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. కన్వీనర్ రాజాన వెంకట్రావు, కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీఎస్ ప్రసాద్, బి. రామానాయుడు, ఎం. సంజీవరెడ్డి, జి. దేముడు, సలహాదారులు పైలా కృష్ణారావు, సీహెచ్ ప్రసాద్, బి. సత్యనారాయణ, ఆర్ఎన్ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి అల్లు గోవిందరావు, ఆడిటర్ ఎస్. రవీంద్ర, జాయింట్ సెక్రటరీ పిల్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్‌లో విశ్వకర్మ జయంతి వేడుకలు

ఉక్కునగరం: ఉక్కునగరం అంబేడ్కర్ కళాక్షేత్రం పక్కన ఉన్న విశ్వకర్మ ఆలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. విశ్వకర్మ పూజా కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న వేడుకలకు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు హాజరవుతున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందని, భక్తులు వేడుకల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని పూజా కమిటీ ప్రతినిధులు కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎల్ఎంఎం పార్కులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రూ.21 వేల జీతం దాటిన కార్మికులకు హెల్త్ కార్డులు, బోనస్, నోటీస్ పే చెల్లించాలన్నారు. ఈ అంశాలపై సీజీఎంకు వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు జి.శ్రీనివాసరావు, పిట్టారెడ్డి, పి.భాస్కరరావు, నాగరాజు, జి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

బోసుబాబుకు పూర్వ ప్రజ్ఞా అవార్డు



అవార్డు అందుకుంటున్న బోసుబాబు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ మాజీ అధ్యక్షుడు జి.బోసుబాబుకు ప్రతిష్టాత్మక పూర్వ ప్రజ్ఞా అవార్డు లభించింది. కార్మిక సంక్షేమం, సేవా కార్యక్రమాల కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రకటించారు. ఇండో గ్లోబల్ ఎడ్యూవర్సిటీ ఆధ్వర్యంలో శనివారం గోవాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గోవా మాజీ ముఖ్యమంత్రి దిగంబర్ కామత్, ఎన్‌సీఆర్‌సీ చైర్మన్ రామానుజస్వామి చేతుల మీదుగా బోసుబాబు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో కార్మిక సంక్షేమం, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు.

'పోతిన' సేవలు మరువలేం



పోతిన సన్యాసిరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, పెందుర్తి ఎమ్మెల్యేగా పోతిన సన్యాసిరావు అందించిన సేవలు మరువలేమని సీపీఐ గాజువాక జోన్ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. సన్యాసిరావు వర్ధంతిని పెదగంట్యాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యెల్లేటి శ్రీనివాసరావు, పల్లేటి పోలయ్య, పి.దుర్గారావు, కె. అచ్యుతరావు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ముగిసిన హిందీ వారోత్సవాలు

కంచరపాలెం : సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి నేతృత్వంలో జరిగిన హిందీ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ శనివారం ముగించారు. శ్రీకృష్ణ విద్యా మందిర్ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్మద విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని హిందీ ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. శేఖర్‌ప్రసాద్, సంధ్య గురంగ్‌లకు 'దేవనాగరి'పురస్కారంతో సత్కరించారు.

62 మందికి కొత్త పింఛన్ల పంపిణీ



అక్కిరెడ్డిపాలెంలో చిన్నారికి దివ్యాంగుల పెంఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. శనివారం వార్డు పరిధిలో గల పెదఅక్కిరెడ్డిపాలెం సచివాలయానికి 9, చినఅక్కిరెడ్డిపాలెం–9, మిండి, రాజీవ్ నగర్, కాళికానగర్, గిరిప్రసాద్‌కాలనీ సచివాలయం పరిధిలో 28, రాంనగర్ 8, గుడివాడ అప్పన్నకాలనీకి 8 చొప్పున కొత్తగా వృద్ధాప్య, డిజేబుల్, వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. నూతన పింఛన్లను వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పింఛన్‌దారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శులు బండారు శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, అడ్మిన్ మున్నీసా, వైఎస్సార్‌సీపీ నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, పోలవరపు శ్రీహరి, చిట్టిబాబు, శ్రీనివాసరావు, బోనెల జోసెఫ్, నేలపాటి సత్యవతి, సయ్యద్ హుస్సేన్, నేలపాటి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు హరించేందుకే ప్రైవేటీకరణ యోచన



947వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉక్కు భూనిర్వాసితుల హక్కులను హరించేందుకే స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 947వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు శ్రమించి స్టీల్‌ప్లాంట్‌ను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు కేంద్ర ప్రభుత్వం తన స్వార్థం కోసం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలనుకోవటం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రజకులను కించపరిచేలా మాట్లాడటం తగదు



సమావేశంలో పాల్గొన్న రజక సంఘం నాయకులు

అగనంపూడి: రజకులను కించపరిచేలా ఒక ఛానల్‌లో మహిళా నాయకురాలు ఒకరు మాట్లాడడం దారుణమని, వెంటనే రజకులకు క్షమాపణ చెప్పాలని విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము, చైర్మన్ పొన్నాడ మోహనరావు డిమాండ్ చేశారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజంలో రజకులు ఇతర కులాలను మర్యాదిస్తూ మెలుగుతున్నారని, అటువంటి రజకులను కించపరిచేలా దిగజారి మాట్లాడడం దురదృష్టకరమన్నారు. చానల్ యాజమాన్యం ఇటువంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని, రజకుల పట్ల అమర్యాదగా మాట్లాడిన మహిళ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వి.రాము, గౌరవాధ్యక్షుడు జైనాథ్, కె.సత్తిరాజు, గురునాథ్, రాము, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండపాలు ఏర్పాటు చేసే వారికి కొన్ని సూచనలు చేశారు. రహదారులపై, ఫుట్‌పాత్‌లపై విగ్రహాలను ప్రతిష్టించరాదన్నారు. మండపాల్లో ఏర్పాటు చేసే విద్యుత్ వైర్లు నాణ్యత కలిగి ఉండాలన్నారు. ఇతరులకు అసౌకర్యం కలిగించేలా లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయరాదన్నారు. రాత్రి 10 తర్వాత లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదన్నారు. లక్కీడిప్, లాటరీ వంటి నగదుతో కూడినవి ఏర్పాటు చేయకూడదని చెప్పారు. మండపాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావు లేదన్నారు. మండపాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మండపాల బయట సీరియల్ లైటింగ్, డెకరేషన్‌లు చేయకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ సుపరిపాలన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 2 కోట్ల 13 లక్షల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల వంటి పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఆయన చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించే వారికి గట్టి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జోన్–6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఈ తులసి, 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు, వెలుగల పరశురామ్, చేగొండి శ్రీనివాసరావు, మాటూరి శ్రీనివాసరావు, నిర్మల, శ్రీనివాస్ పట్నాయక్, బొడ్డ రమణ తదితరులు పాల్గొన్నారు.



